# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 02 మే 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 279

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## అంతర్జాతీయ పరిణామాల ప్రభావం

2వేలు తగ్గిన బంగారం ధర

2లో..



నెల జీతంలో నిత్యావసరాలు, ఇతర ఖర్చులకు బడ్జెట్ పద్మనాభం వేసుకునే లెక్కల మాదిరి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తానూ లెక్కలు వేసుకుంటున్నానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.



# బడ్జెట్ పద్మనాభంలా లెక్కలేసుకుంటున్నా

- గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పులు రూ.8.29 లక్షల కోట్లు
- రాష్ట్ర రాబడిలో నెలకు రూ.6,500 కోట్లు అప్పులకే పోతోంది
- ఆర్టీసీ కార్మికులారా... సమ్మె ఆలోచన వద్దు
- కార్మిక దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- సంస్థను కాపాడుకునే బాధ్యత మనదే
- గత అప్పులకు వడ్డీల కోసం అప్పులు చేస్తున్నాం
- మేడే ఉత్సవాల్లో సిఎం రేవంత్ రెడ్డి

కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు- చెప్పాల్సిన బాధ్యత నాపై ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మె పోటు- రాష్ట్రానికి నష్టం చేస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది.. మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుంది.. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దు..

2లో..



2లో..

## కులగణను ఏనాడూ పట్టించుకోని కాంగ్రెస్

తెలంగానలోనూ తూతూత మంత్రంగా సర్వే

ఎవరో డిమాండ్ చేస్తే తీసుకున్న నిర్ణయం కాదు

కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మంత్రి కిషన్ రెడ్డి

## బలగాల ఆత్మస్థయిర్యం దెబ్బతీస్తారా

పహల్గామ్ ఘటనపై వ్యాఖ్యంపై సుప్రీం ఆగ్రహం



2లో..

## ఉగ్రవాదులను వెంటాడి వేటాడి పట్టుకుంటాం

కేంద్రమంత్రి అమిత్ షా హెచ్చరిక



2లో..

## కులగణన నిర్ణయం.. కాంగ్రెస్ విజయం



హైదరాబాద్: కులగణన నిర్ణయం కాంగ్రెస్ విజయమని, దేశవ్యాప్తంగా దీనిని నిర్దిష్ట వ్యవధిలోగా పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ ప్రక్రియను ఎప్పుడు ప్రారంభించి ఎప్పుడు ముగిస్తారో వెల్లడించాలని... ఏడాది గడువులోగా పూర్తిచేసి అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. తెలంగాణ చేసిన కులగణనతో దేశానికి లాభం జరిగిందని అన్నారు. కులగణనపై కేంద్రం నిర్ణయం తీసుకున్నందున తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని అభినందించారు. అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. "న్యాయచిక్కులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం చట్టబద్ధంగా, విజయవంతంగా కులగణన సర్వే పూర్తిచేసింది. ఇది దేశానికి ఆదర్శంగా మారింది. మా అనుభవాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. మా అనుభవాలు, సూచనలు, సలహాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. కేంద్ర అధికారులు ఇక్కడికి వచ్చినా సరే... లేదా ఇక్కడి అధికారుల్ని ఢిల్లీకి రమ్మన్నా సరే. బలహీనవర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్‌పార్టీ ఒక మెట్టు దిగి... కేంద్రానికి అవసరమైన సమాచారాన్ని, అనుభవాలను అందిస్తుంది. ఎలాంటి భేషజాలు లేవు. ఈ విషయంలో కేంద్రంతో కలిసి పనిచేసేందుకు కట్టుబడి ఉన్నాం. కేంద్రం అన్ని రాష్ట్రాలతో చర్చించి ఈ ప్రక్రియ పూర్తిచేయాలి" అని సూచించారు. కాంగ్రెస్‌పార్టీ ఒత్తిడికి తలొగ్గి ప్రధాని నరేంద్రమోదీ కులగణనపై నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయానికి రాజకీయాలకు తావులేకుండా కేంద్రానికి అభినందనలు చెబుతున్నానని అన్నారు. కులగణనకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

**రాహుల్‌గాంధీ పోరాటం చేయడం వల్లే...**

యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు ఒక ప్రయత్నంగా జనగణనలో కులగణన చేసినా, ఆ వివరాలకు మోదీ సర్కారు ఆమోదం చెప్పలేదు. రాహుల్‌గాంధీ పోరాటం చేయడంతో... కేంద్రం ఇప్పుడు నిర్ణయం తీసుకుంది. రాహుల్ ఆలోచన అమలు చేసేందుకు ఎవరితోనైనా కలిసి పనిచేసేందుకు సిద్ధం. కులాల లెక్కలతో సంక్షేమ పథకాలు మెరుగ్గా అమలవుతాయి. కేంద్రం కులగణన చేస్తే ఆ డేటా ప్రామాణికమవుతుంది. ఏ డేటా లేకుంటే రాష్ట్రాలు సేకరించిన డేటా ప్రామాణికం.

**రాజ్‌నాథ్‌సింగ్ కులగణన చేపట్టబోమని అఫిడవిట్ దాఖలు చేశారు**

మొన్నటివరకు భాజపా నేతలు కులగణనకు వ్యతిరేకంగా మట్లాడారు. రాజ్‌నాథ్‌సింగ్ సుప్రీంకోర్టులో కులగణన చేపట్టబోమని అఫిడవిట్ దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దయ్యేవి. రాజ్యాంగాన్ని మార్చేవారు. ఎన్నికల్లో ప్రజలు తిప్పికొట్టి 240 సీట్లు ఇచ్చారు. సంకీర్ణ ప్రభుత్వంలో అనుకున్న ఎజెండా అమలు చేయలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క కాంగ్రెస్ ఒత్తిడి పెరిగింది. దీంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు, రాజకీయ అవసరాల కోసం కులగణన చేపడతామని ప్రకటించాల్సి వచ్చింది.

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం**

కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చే రాష్ట్రాల్లో కులగణన చేస్తామని భారత్ జోడో యాత్రలో రాహుల్ హామీ ఇచ్చారు. ఆ మేరకు తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో పూర్తి చేసి, దేశానికి మార్గదర్శకంగా నిలిచింది. రాహుల్‌గాంధీ కూడా ఇదే పేర్కొన్నారు. జనగణనలో కులగణన తక్షణమే చేపట్టాలని.. 50 శాతం రిజర్వేషన్ల పరిమితి పెంచి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి బిల్లు, తీర్మానం పంపించాం. సర్వేపై మొత్తం వివరాలిచ్చాం. సున్నితమైన వివరాలు ఇవ్వలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గల్లీ నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వరకు పోరాటం చేశాం. జంతర్‌మంతర్ వద్ద చేసిన ధర్నాకు మోదీ, ఎన్డీఏ మిత్రపక్షాలు మినహా అందరూ మద్దతు తెలిపి, తెలంగాణ నిర్ణయాన్ని స్వాగతించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించడం కోసం ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం. బలహీనవర్గాలకు మేలు జరగాలన్నదే కాంగ్రెస్‌పార్టీ సంకల్పం. జనగణనలో కులగణన చేయాలని తెలంగాణ రాసిన లేఖను నమ్మి ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారు.

## భారత్‌లో సృష్టిద్దాం.. జగతికి అందిద్దాం

మనుషుల జీవితాల్లో మున్ముందు సాంకేతికత మరింత కీలకపాత్ర పోషిస్తుంది. సృజనాత్మక రంగంలో ఉన్నవారు కరుణామయమైన భవిష్యత్తు నిర్మాణం దిశగా కృషి చేయాలి.



ముంబయి: సంగీతం, సినిమా, గేమింగ్ రంగాల్లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఉదయిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్‌లో 'ఆరెంజ్ ఎకానమీ' (సృజనాత్మక ఆర్థికవ్యవస్థ) పరిఢవిల్లుతోందని తెలిపారు. ప్రపంచం కొత్తదనం కోరుకొంటున్న ఈ తరుణంలో "భారత్‌లో సృష్టిద్దాం, జగతికి అందిద్దాం" నినాదంతో మనం ముందడుగు వేయడానికి ఇదే సరైన తరుణమని చెప్పారు. దేశంలో తొలిసారిగా ముంబయిలో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్' (వేవ్స్ 2025)ను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు.

నగర శివారులోని బాంద్రా – కుర్లా కాంప్లెక్సులో గల జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటరులో ఏర్పాటుచేసిన ఈ సదస్సులో ప్రధాని ప్రసంగిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సృజనశీలురు, స్టార్టప్స్ – పరిశ్రమల అధినేతలు, విధాన రూపకర్తలను వేవ్స్ ఒక వేదిక మీదకు తెచ్చిందన్నారు. ఈ వేదిక భారత్‌ను మీడియా, వినోదం, డిజిటల్ ఆవిష్కరణల్లో ప్రపంచ కేంద్రంగా నిలబెడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశం అంతర్జాతీయ చలనచిత్ర నిర్మాణకేంద్రంగా అవతరిస్తున్న నేపథ్యంలో ప్రపంచ ప్రతిభకు వేదికగా మారే సామర్థ్యం వేవ్స్ సంతరించుకొంటుందన్నారు. ఇండియన్ 'ఖానా' మాదిరిగానే 'గానా' కూడా ప్రపంచ ప్రసిద్ధం అవుతుందన్నారు. తెర పరిమాణం చిన్నదిగా మారుతున్నప్పటికీ, పరిధి అనంతమని వ్యాఖ్యానించారు. విభజనవాదం, హానికారకమైన భావజాలాల నుంచి యువతను రక్షించాల్సిన అవసరం ఉందని..

మన సాంస్కృతిక సమగ్రతను నిలబెడుతూ సానుకూల విలువలను పెంపొందించడానికి 'వేవ్స్' ఒక ముఖ్యమైన వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. సదస్సులో భారత్ పెవిలియన్‌ను ప్రధాని ప్రారంభించారు. దేశం సాధించిన ముఖ్యమైన ఆవిష్కరణలకు ఇది ప్రతిబింబమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మహారాష్ట్ర పెవిలియన్‌ను సైతం ప్రధాని సందర్శించారు.

## ప్రతికూల పరిస్థితులతో రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేత

వచ్చే మార్చినాటికి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వేగవంతానికి చర్యలు చేపట్టి 2027 మార్చి నాటికి ఉదండాపూర్ వరకు నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రాజెక్టుల కోసం భూ సేకరణకు సత్వర చర్యలకు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నాం.



2లో..

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# అంతర్జాతీయ పరిణామాల ప్రభావం

# 2వేలు తగ్గిన బంగారం ధర

హైదరాబాద్: బగారం ధరల పెరుగుదలతో దాదాపు 15శాతంకొనుగోళ్లు పడిపోయాయని నివేదికలు వెల్లడించిన వేళ ధరలు దిగి వచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలతో దేశీయ మార్కెట్‌లో ఆల్–టైమ్ గరిష్ఠానికి చేరిన బంగారం ధర గత కొన్ని రోజులుగా కాస్త దిగొస్తోంది. అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టడం, రష్యా–ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందానికి సంకేతాలు కన్పించడం, డాలర్ విలువ బలపడుతుండటంతో పుత్తడికి గిరాకీ తగ్గినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. గురువారం ఒక్క రోజే 10 గ్రాముల పుత్తడి ధర దాదాపు రూ.2వేల పైన తగ్గింది. 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.2,180 తగ్గి రూ.95,730 (10 గ్రాములకు) పలుకుతోంది. దాదాపు 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. అటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధర కాస్త దిగొచ్చింది. ప్రస్తుతం ఔన్సు ధర 3,236.94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీంతో వరుసగా రెండో రోజు పుత్తడి ధర దిగొచ్చినట్లు– పేర్కొంటు–న్నారు. త్వరలోనే అమెరికా ఆర్థిక గణాంకాలు వెలువడున్నాయి. ఇవి కూడా పసిడి ధరలపై ప్రభావం చూపే అవకాశాలున్నట్లు– తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అక్షయ తృతీయ సందర్భంగా దేశీయ మార్కెట్లో బుధవారం బంగారానికి గిరాకీ పెరిగింది. అక్షయ తృతీయ విక్రయాలు రూ.12,000 కోట్ల విలువైన 12 టన్నుల పసిడి, రూ.4,000 కోట్ల విలువైన వెండి కలిపి మొత్తంగా రూ.16,000 కోట్లు–గా ఉండొచ్చని ఆలిండియా జువెలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ అధ్యక్షుడు పంకజ్ అరోరా వెల్లడించారు.

# అప్పన్న సన్నిధిలో ప్రమాద ఘటన విచారణ చేపట్టిన త్రిసభ్య కమిటీ

విశాఖపట్నం: విశాఖ జిల్లా సింహాచలంలోని సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో జరిగిన ప్రమాద ఘటనపై ఏపీ ప్రభుత్వం నియమించిన త్రిసభ్య విచారణ కమిటీ గురువారం ఇక్కడి ప్రమాద పరిస్థితులపై ఆరా తీసింది. మున్సిపల్ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ అధ్యక్షతన, ఈగల్ విభాగాధిపతి ఐజీ ఆకే రవికృష్ణ, జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వర రావు సభ్యులుగా కమిషన్‌ను నియమించారు. గురువారం ప్రమాద ఘటనను మరోసారి పరిశీలించిన కమిటీ బృందం.. రీటైనింగ్ వాల్ కూలిపోవడంతో ప్రమాదం జరిగిందని తేల్చింది. క్వాలిటీ నిర్మాణం కాకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు– కనిపించిందని పేర్కొంది. ఉత్సవాల కోసం నిర్మాణాన్ని తాత్కాలిక పూర్తి చేశారన్నారు. గోడ నిర్మాణాన్ని ఈ నెల 16వ తేదీన ప్రారంభించి.. 26 వరకు చేపట్టినట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు, ఇంజనీర్లతో పాటూ దేవాదాయ అధికారులను విచారించినట్లు– మున్సిపల్ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. అలాగే జిల్లా అధికారులతో కూడ మాట్లాడినట్లు చెప్పారు. పూర్తి వాస్తవాలను ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు– తెలిపారు. అయితే టెంపుల్ మాస్టర్ ప్లాన్ నిబంధనలకు అనుకూలంగా జరిగిందా లేదా అనేది నిర్ధారిస్తామని చెప్పారు. వైఫల్యాలు, లోపాలపై నెల రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. కాంట్రాక్టర్‌తో పాటు– అనుమతి ఇచ్చిన అధికారులు ఎవరు...? ఇందులో వాళ్ల ప్రమేయం ఏ మేరకు ఉందనే అంశాలపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చందనోత్సవంలో జరిగిన ప్రమాద ఘటనలో మొత్తం ఏడుగురు భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే.

# అమరావతి పునరుజ్జీవం మన అదృష్టం గన్నవరం నేతలతో మంత్రి అనిత సమీక్ష

విజయవాడ: అమరావతికి మళ్లీ పునరుజ్జీవం జరగడం మన అదృష్టమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు అమరావతిని నాశనం చేశారని మండిపడ్డారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదగా ప్రారంభమైన అమరావతిని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి గురించే పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు మళ్లీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎంగా నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఏపీ రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణం జరగడం ఇది చాలా శుభ సూచకమని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతి పర్యటన సందర్భంగా గన్నవరం నియోజకవర్గంలో హోం మంత్రి వంగలపూడి అనిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మీడియాతో మాట్లాడారు. అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి వస్తున్నారని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర రాష్ట్రంలో గన్నవరానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉందని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో నాయకులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఎన్ని కేసులు పెట్టిన మళ్లీ తెలుగు దేశం పార్టీకే అధికారాన్ని పట్టం కట్టారని గుర్తుచేశారు.

## ప్రధాని సమక్షంలో అమరావతి పునర్నిర్మాణ పనులు మాజీ సిఎం జగన్‌కు ఆహ్వానం పలికిన ప్రభుత్వం



అమరావతి:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునరుజ్జీవన పనులకు ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కూటమి ప్రభుత్వ ఆహ్వానం పంపించింది. అమరావతి రీ లాంచ్ పనుల ప్రారంభోత్సవం కోసం మే2వ తేదీన ముహూర్తం నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమరావతి పనులను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపడుతోంది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా ఈ పనులను ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగానే మే 2వ తేదీన జరుగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు హాజరు కావాలని జగన్మోహన్ రెడ్డికి కూటమి ప్రభుత్వం ఆహ్వానపత్రికను పంపించింది. తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లి ప్రొటోకాల్ అధికారులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ని(బుధవారం) సాయంత్రం జగన్ ఇంటి దగ్గర లేకపోవడంతో ఆయన పీఏ కే. నాగేశ్వరరెడ్డికి ఆహ్వాన పత్రికను ప్రోటోకాల్ అధికారులు అందించారు. గతంలో కూడా అమరావతి ప్రారంభోత్సవానికి చంద్రబాబు ప్రభుత్వం ఆహ్వానం పంపించిన జగన్ మాత్రం రాలేదు. అయితే రేపటి కార్యక్రమానికి జగన్ వస్తారా రారా అనే విషయం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూడు రాజధానులను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ప్రభుత్వం అమరావతి రాజధాని పనులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ మేరకు చర్యలు చేపట్టింది. రాజధాని అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే 2వ తేదీన పర్యటించనున్నారు. అమరావతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. మోదీ పర్యటన సందర్భంగా ఏపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ ఏర్పాట్లను దగ్గరుండి మంత్రి నారాయణ పర్యవేక్షిస్తున్నారు. ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటు–పాట్లు– లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మంత్రి నారాయణ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ప్రధాని సభకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని పూర్తి అయినట్లు తెలుస్తోంది.

## జీఎస్టీ వసూళ్లలో రికార్డు గతేడాదిని మించి వసూళ్లు




న్యూఢిల్లీ: జీఎస్టీ వసూళ్లు ఏప్రిల్ నెలలో రికార్డు సృష్టించాయి. గడిచిన నెలలో ప్రభుత్వానికి జీఎస్టీ వసూళ్లు రికార్డ్ స్థాయిలో వచ్చాయి. మే 1న విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్ నెలలో జీఎస్టీ రూపంలో రూ.2.37 లక్షల కోట్లు వసూలయ్యాయి. అంతకుముందు నెలలో అంటే మార్చిలో రూ.1.96 లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి. గతేడాది ఏప్రిల్ నెలలో ప్రభుత్వం రూ.2.1 లక్షల కోట్లు– జీఎస్టీ కింద వసూలు చేసింది. వార్షిక వసూళ్ల స్పీడు 12.6 శాతంగా ఉండటం అంటే, 17 నెలల్లో ఇదే గరిష్టం. ఆర్థిక వ్యవస్థకు వినియోగం కూడా తోడవడంతో త్రైమాసిక వసూళ్లు 2025 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ .5.75 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశీయ లావాదేవీల నుంచి జీఎస్టీ ఆదాయం 10.7 శాతం పెరిగి రూ.1.9 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకున్న వస్తువుల ఆదాయం 20.8 శాతం పెరిగి రూ.46,913 కోట్లకు చేరింది.

# బడ్జెట్ పద్మనాభంలా లెక్కలేసుకుంటున్నా




హైదరాబాద్:ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడండని మే డే వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది.. ఇది మీ సంస్థ.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉంది అన్నారు. గత పదేళ్లలో విధ్వంసం జరిగింది.. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీ కొనసాగిందన్నారు. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకండి.. ఏదైనా సమస్య ఉంటే మంత్రిగారితో చర్చించండి.. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం.. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచన చేయండి అన్నారు. అణాపైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లేది లేదు.. మీ కోసమే ఖర్చు చేస్తాం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు.. అందుకే ఒకసారి ఆలోచించండి అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన మేడే వేడుకల్లో సిఎం పాల్గొని ప్రసంగించారు. కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు– చెప్పాల్సిన బాధ్యత నాపై ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మె పోటు– రాష్ట్రానికి నష్టం చేస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది.. మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుంది.. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దు.. వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు అని సూచించారు. ఆర్టీసీ కార్మికులు నన్ను నమ్మండి.. నమ్ముకున్న మీకు అండగా ఉంటాను అని చెప్పుకొచ్చారు. వారానికి ఒకరోజు సెలవు.. కార్మికుల పోరాట ఫలితమే అన్నారు. ఇక, తెలంగాణలో ఆర్థిక మాంద్యం తక్కువ ఉందన్నారు. సింగరేణిలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు మొదటి సారి మనమే బోనస్ ఇచ్చాం.. సింగరేణిని పదేళ్లు నిర్వీర్యం చేశారు .. కారుణ్య నియామకాలు సరళీకృతం చేశాం.. ఒక కుటుంబమే 7 లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపించారు. కార్మికుల పట్ల ఎప్పుడైనా అనుకూలంగా మాట్లాడారా వాళ్ళు.. లక్ష రెండు వేల కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లకు ఇచ్చాడు.. కానీ కట్టిన ముడేళ్లకే కూలి పోయింది అని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన అప్పులు కట్టడానికి లక్ష రెండు వేల కోట్లు– అప్పు తెచ్చిన.. వడ్డీలు కట్టడానికే సరిపోతుంది.. ఏ పథకం అయినా ఆగిందా?.. అని ముఖ్యమంత్రి రేవంత్ ప్రశ్నించారు. ఇక, ఖజానా అంతా లూటీ చేసినా ఏ పథకం ఆగలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పేద ప్రజల ఇండ్లో సన్న బియ్యం ఇస్తున్నాం.. గుజరాత్ లో కూడా ఏడాదిలో 58 వేల ఉద్యోగాలు ఇచ్చారా?.. నేను ఇచ్చిన.. మనం దివాలా తీశాం.. కేసీఆర్ కుటు–ంబం మాత్రం కోట్లు– వెనకేసుకున్నారు అని ఆరోపించారు. గతంలో మీ ఫోన్ లు స్వేచ్ఛగా మాట్లాడుకున్నారా..

ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడుకుంటు–న్నారు.. స్వేచ్ఛ, సంక్షేమం ఇచ్చినం మేమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఆర్టీసీ కార్మికులు పంథానికి పోకండని సూచించారు. మిమ్మల్ని ఆదుకుంటాం.. మీ సమస్యలు మంత్రితో మాట్లాడండి.. లేదంటే నా దగ్గర ఉన్న ఖజానా మీకు ఇస్తా.. మీరే చూసి చెప్పండి అన్నారు. బడ్జెట్ పద్మనాభం లాగా తయారైంది నా పరిస్థితి అని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# కులగణను ఏనాడూ పట్టించుకోని కాంగ్రెస్



**హైదరాబాద్**: బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఏ సామాజిక వర్గం వెనకబడి ఉందో గుర్తించవచ్చు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగ పడుతుంది. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోంది. అలాంటప్పుడు కాంగ్రెస్ గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదు. ఇది రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదు. సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున కులగణన నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్‌లా.. ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయం. తెలంగాణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూమంత్రంగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదు' అని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో జరగబోయే జనగణనలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.. ప్రధానికి హృదయపూర్వక ధన్యవాదాలు.. దేశంలో సానుకూలమైన మార్పుకు, కులగణన.. చరిత్రాత్మకమైన కులగణన, చరిత్ర పుటల్లో నిలిచిపోనుంది అన్నారు. ప్రతిపక్ష పార్టీలు నాటకాలకు తెరలేపుతున్నారు.. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లకు సంబంధించి, కుట్రలు కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. అలాగే, ముస్లింలను
తీసుకెళ్లి బీసీల్లో చేర్చడం దారుణం.. కాంగ్రెస్ అన్ని తప్పుడు నిర్ణయాలు చేసింది.. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ రాష్ట్రపతుల అభ్యర్థిత్వాలను వ్యతిరేకించింది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మోడీ సర్కార్ ఎన్నో ఏళ్ల పెండింగ్ అంశం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టుకు తమ వైఖరిని స్పష్టం చేశాక.. వర్గీకరణ అంశంపై కోర్టు కీలక తీర్పు ఇచ్చింది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.



## బలగాల ఆత్మస్థయిర్యం దెబ్బతీస్తారా

న్యూఢిల్లీ: వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్థయిర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది చాలా క్లిష్ట సమయం. ఉగ్రవాదంపై పోరులో ప్రతి పౌరుడు చేతులు కలపాలి. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కాస్త బాధ్యతతో వ్యవహరించండి. అందులో సున్నితత్వాన్ని అర్థం చేసుకోండి. ఇలాంటి చర్యలతో మన బలగాల ఆత్మస్థయిస్థైర్యాన్ని దెబ్బతీయాలను కుంటున్నారా? మీక్కూడా దేశంపై బాధ్యత ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దని ధర్మాసనం సూచించింది.
జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ముష్కరులు జరిపిన పాశవిక దాడితో యావత్ దేశం ఉలిక్కి పడింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని దేశమంతా ఒక్కటైంది. ఈ నేపథ్యంలో పహల్గాం దాడి పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్తైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని కోర్టు పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి అంశాలను న్యాయ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించొద్దని, ఉగ్రవాద ఘటనల విచారణకు జడ్జీలు నిపుణులు కారని ధర్మాసనం వెల్లడించింది. అయితే, ఇతర రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే తాను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు– పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థుల కోసమే అయితే హైకోర్టులకు వెళ్లొచ్చని తెలిపింది. కోర్టు సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.
ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో ఓ కశ్మీరీ సహా 26 మంది ప్రాణలు కోల్పోయారు. ఈ దాడితో భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి గట్టిగా బదులిస్తామని భారత్ స్పష్టంగా చెప్పింది.

## ఉగ్రవాదులను వెంటాడి వేటాడి పట్టుకుంటాం

**కేంద్రమంత్రి అమిత్ షా హెచ్చరిక**

న్యూఢిల్లీ: ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టుకొని శిక్షిస్తామని వేటాడి వెంటాడి పట్టుకుంటామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఉగ్రదాడిపై తొలిసారి షా స్పందించారు. కాశ్మీర్ ఉగ్రవాద చర్యకు గట్టి సమాధానం ఇస్తున్నామని అన్నారు. ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో చోటుచేసుకున్న ఉగ్రదాడిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తొలిసారి స్పందించారు. ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని అంతం చేస్తామని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేంత వరకు మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పడం ఖాయం. ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టు–కొని శిక్షిస్తాం. కాశ్మీర్ ఉగ్రవాద చర్యకు గట్టి సమాధానం ఇస్తున్నాం. దాడి చేసి విజయం సాధించామని అనుకుంటే అది పొరపాటే. ఇది మోదీ సర్కార్. మోదీ సర్కార్ ఎవరినీ వదిలి పెట్టదు. వెంటాడి వెంటాడి అంతం చేస్తుంది. పహల్గామ్‌లో అమాయకుల చావులకు కారణమైన ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని అన్నారు.

## ప్రతికూల పరిస్థితులతో రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేత

మహబూబ్‌నగర్: ఎస్ఎల్బీసీ టన్నెల్ సంఘటన దురదృష్టకరం అని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. బాధ్యతగా ఆ కుటుంబ సభ్యులను ఆదుకుంటాం.. దొరకని ఆరు మృతదేహాలు బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలుపుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వపరంగా ఒక్కో కుటుంబానికి 25 లక్షల నష్ట పరిహారం చెల్లించాం.. జియో లాజికల్ సర్వే సూచన మేరకే రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేశాం.. ఆరు మృతదేహాల ఘటన స్థలంలో క్రిటికల్ కండిషన్ ఉంది, రెస్క్యూ సిబ్బంది ప్రాణాలకు ముప్పు పొంచి ఉండటంతో పనులు ఆపేశామని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పూర్తి కోసం హై లెవెల్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ వేశామన్నారు. 2026 మార్చి 31వ తేదీ వరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ హామీ ఇచ్చారు. అయితే, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వేగవంతానికి చర్యలు చేపట్టి 2027 మార్చి నాటికి ఉదండాపూర్ వరకు నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రాజెక్టుల కోసం భూ సేకరణకు సత్వర చర్యలకు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నాం.. పాలమూరు జిల్లా గత బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైందని
ఆరోపించారు. టీఆర్ఎస్ హయాంలో కృష్ణా నది జలాల కేటాయింపులో పాలమూరు, నల్లగొండకు తీరని అన్యాయం జరిగింది అన్నారు. 819 టీ–ఎంసీల కృష్ణ జలాలను ఆంధ్రకు కేటాయిస్తుంటే.. కేసీఆర్ సర్కార్ చోద్యం చూసిందన్నారు. 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు వాటా దక్కింది.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం లక్ష కోట్ల ప్రజాధనం గోదావరి పాలు చేశారు.. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు మరో రెండు ఏళ్లలో పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

# కష్టపడితేనే పనివిలువ తెలుస్తుంది

అమరావతి: ఉపాధి హామీ పథకం దేశానికి, రాష్ట్రానికి ఒక వరమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. తమ ప్రభుత్వంలో శ్రామికులకు గుర్తింపు, గౌరవం ఉంటుందని అన్నారు. జగన్ ప్రభుత్వంలో పేదలు, శ్రామికుల కష్టాన్ని దోచుకుని దాచుకున్నారని ఆరోపించారు. మేడే సందర్భంగా గురువారం మంగళగిరిలో ఉపాధి శ్రామికులతో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ జిల్లాల నుంచి ఉపాధి శ్రామికులు హాజరయ్యారు. వంద రోజులు ఉపాధి పనులు పూర్తి చేసిన వారిలో వివిధ జిల్లాల నుంచి పది మంది అధికారులను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఉపాధి శ్రామికులతో ఆత్మీయ సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కష్టపడడం నేర్చుకోవాలని, వ్యవసాయంలో యువత శిక్షణ పొందాలని అన్నారు. అలాగే ఉపాధిని వ్యవసాయానికి జోడించాల్సి ఉందన్నారు. ఉపాధి శ్రామికులు మాటలు వింటే ఆనందం కలిగించిందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధి పనుల ద్వారా పేదలకు ఆసరా కలుగుతుందని చెప్పారు. మొగల్తూరులో తమకు ఉన్న రెండు ఎకరాల పొలం అమ్మేసుకున్నామని గుర్తుచేశారు. తర్వాత ఎనిమిది ఎకరాలుకొని .. తాను వ్యవసాయం చేస్తున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. శ్రమ , కష్టం విలువ తనకు
తెలుసునని పవన్ కల్యాణ్ అన్నారు. ఉపాధి కూలీ పదం తొలగించి ఉపాధి శ్రామికులంగానే పిలుస్తామని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు, మీడియా కూడా ఈ శ్రామికులు పదం వాడాలని విజ్ఞప్తి చేశారు. ఇరవై ఏళ్ల వయసులో ఏం చేయాలో తనకు తెలిసేది కాదన్నారు. ఆ తర్వాత తనవంతుగా శ్రమ ఆయుధంగా ముందుకు సాగానని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తుందని తెలిపారు. శ్రామికులకు ఎంత మంచి చేయగలమో ఆలోచన చేస్తున్నామని అన్నారు. తమ మీద నమ్మకంతో ప్రజలు అధికారం అప్పగించారని తెలిపారు. మూగ జీవాల రోదన కూడా ఉండకూడదనేది తమ ఉద్దేశమని చెప్పారు. గజేంద్ర మోక్షం తరహాలో పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బంది మూగ జీవాల గొంతు తడుపుతున్నారని అన్నారు. తాము అదేశాలు ఇచ్చినా క్షేత్ర స్థాయిలో వారు పని చేస్తున్నందుకు అభినందిస్తున్నానని తెలిపారు. ఏపీని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత గత జగన్ ప్రభుత్వానిదని ఆరోపించారు. మద్యం నిషేధిస్తామన్న వారు మద్యాన్ని ఏరులై పారించారని విమర్శించారు. పేదలు, శ్రామికులు కష్టాన్ని వైసీపీ ప్రభుత్వం దోచుకుని దాచుకుందని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలను గాడిలో పెట్టి పాలన సాగిస్తున్నామని పవన్ కళ్యాణ్ చెప్పారు. పల్లెల అభివృద్ధి దేశాభివృద్ధికి పట్టు–గొమ్మలని ఉద్ఘాటించారు. అందుకే పల్లె పండుగ పేరుతో రూ.377.37 కోట్లతో గోకులాలను పూర్తి చేశామని తెలిపారు. ప్రతి రైతుకు అదనపు ఆదాయం కూడా లభిస్తుందన్నారు. 13,500 పశువుల తొట్టేల కోసం రూ. 60 కోట్లు– ఖర్చు పెట్టామంటే అది శ్రామికుల కష్టం వల్లేనని చెప్పారు. నాలుగు వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశామని అన్నారు. మరో నాలుగు వేల కిలోమీటర్ల రోడ్లకు శ్రీకారం చుట్టామని చెప్పారు. డోలీ వెళ్లే ప్రాంతాల్లో రోడ్లు వేసి అంబులెన్స్‌లు వెళ్లేలా చేశామని అన్నారు. సీఎం చంద్రబాబు విజన్‌తో మోదీ సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. మొగల్తూరులో ప్రధాని జీవన్ జ్యోతి గురించి తెలియదని పవన్ కల్యాణ్ అన్నారు. ఒక్కరోజే వారందరికీ వర్తించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎండ తీవ్రత వల్ల చాలా మంది ఇబ్బందులు పడతారని అన్నారు. కార్మికులకు 11 గంటల్లోపు పనులు పూర్తి చేసేలా చూడాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. పనులు పెండింగ్‌లో ఉంటే సాయంత్రం నాలుగు గంటల తర్వాత పనులు పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి చోట నీడనిచ్చేలా చిన్న పాకలు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ ఉన్న పరిస్థితులు బట్టి నీడ పట్టు–న ఉండేలా పని ప్రాంతాల్లో చూసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు కూడా అందుబాటు–లో ఉండేలా చూడాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం వేతనాలను సీఎం చంద్రబాబు పెంచారని గుర్తుచేశారు. శ్రామికులు ప్రమాద భీమా కోసం బ్యాంక్‌తో ఒప్పందం చేసుకున్నామని అన్నారు. ప్రధాని మోదీ నిర్దేశకత్వర, చంద్రబాబు నాయకత్వంలో ఉపాధి హామీ శ్రామికులు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులు త్వరలో పూర్తి చేస్తాం. మనిషికి విల్ పవర్ ఉండాలి. దారిద్యం÷-ర పేరుతో ఎప్పుడూ పనులు ఆగకూడదు. పనిచేసే వాళ్లు ముందు ఉంటే దేశం త్వరగా అభివృద్ధి చెందుతుంది. నేను అయినా పని చేయడంలో ఎప్పుడూ ముందుంటా. పనిచేసే వారికి ముందు గౌరవం ఇవ్వాలి. మనకి కొన్ని జిల్లాల్లో చాలా దుర్భిక్షం ఉంది.

వేగుచుక్క



## కేటీఆర్‌కు అరుదైన అవకాశం..

### ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సు నుంచి ఆహ్వానం

తెలంగాణ: మాజీ మంత్రి కేటీఆర్ జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్‌లో ముఖ్యవక్తగా పాల్గొననున్నారు. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే అంశంపై జరిగే ఈ సదస్సులో ఆయన ప్రసంగిస్తారు. కేటీఆర్ అనుభవాలు, ఆలోచనలు అంతర్జాతీయ విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ సేథీ తెలిపారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అరుదైన అవకాశం దక్కింది. ఆయన ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ అంతర్జాతీయ సదస్సుకు హాజరుకానున్నారు. జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో జరగనున్న ఈ సదస్సుకు కేటీఆర్‌ను ముఖ్యవక్తగా కేటీఆర్‌ను ఆహ్వానించారు. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే థీమ్‌తో ఈ ఏడాది సదస్సు జరగనుంది. ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ సేథీ మాట్లాడుతూ.. కేటీఆర్ తన అనుభవాలు, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, నిపుణులతో పంచుకుంటే, భారత అభివృద్ధి ప్రస్థానంలో భాగం కావడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని తెలిపారు.

ప్రపంచ సమస్యల పరిష్కారం, స్థిరమైన అభివృద్ధికి సాంకేతికతల పాత్రపై ఈ సదస్సులో చర్చిస్తారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో తెలంగాణలో అమలు చేసిన వినూత్న విధానాలు, సాంకేతిక ఆధారిత అభివృద్ధి నమూనాలను కేటీఆర్ వివరించనున్నట్లు వెల్లడించారు. కేటీఆర్ ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా ప్రపంచంపై భారతదేశ సానుకూల ప్రభావం, నాయకత్వ లక్షణాలు బలంగా చాటవచ్చని సిద్ధార్థ్ సేథీ పేర్కొన్నారు. కాగా, యూరప్‌లో భారత్‌కు సంబంధించిన అతిపెద్ద కార్యక్రమాల్లో ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ ఒకటి. భారతదేశ పురోగతి, ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో మార్పులు, ప్రపంచ సహకార అవకాశాలపై చర్చలు జరుగుతాయి. భారతదేశాన్ని ప్రపంచానికి చేరువ చేయడం, పరిశోధన, సాంకేతికత, విధానాల్లో ఇతర దేశాల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ ఫోరమ్ లక్ష్యం.

ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఐటీ మంత్రిగా పని చేసిన కేటీఆర్.. తెలంగాణ రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చడంలో కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్ మహా నగరంలో అనేక అంతర్జాతీయ ఐటీ కంపెనీలను స్థాపించడంలో ఆయన కృషి చేశారు. టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించారు. ఐటీ రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపారు. ఐటీ రంగం ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించడంలో కేటీఆర్ విశేషంగా కృషి చేశారు.

## గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు.. బాలికను బలిచ్చేందుకు యత్నం..

సంగారెడ్డి: జిల్లా సదాశివపేటలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. బస్టాండ్ సమీపంలోని బీరువాల తయారీ కర్మాగారంలో మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కొందరు వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహిస్తుండగా.. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అయోధ్యకు చెందిన ఓ స్వామీ ఈ పూజలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బంగారం కోసం ఆరేళ్ల బాలికను బలి ఇవ్వడానికి ప్రయత్నించారని స్థానికులు అనుమానిస్తున్నారు. బాలిక తండ్రి డబ్బు ఆశకు లొంగి పాపను పూజ స్థలానికి తీసుకొచ్చాడని సమాచారం.

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో క్షుద్ర పూజలు తీవ్ర కలకలం రేపాయి. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల ఓ బీరువాల తయారీ కర్మాగారంలో మంగళవారం (ఏప్రిల్ 29) అర్ధరాత్రి దాటిన తర్వాత క్షుద్ర పూజలు జరుగుతున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బంగారం కోసం ఆరేళ్ల బాలికను బలి ఇవ్వడానికి ప్రయత్నించారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయోధ్య నుంచి వచ్చిన ఓ స్వామీ ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీరువాల కర్మాగారంలో నిధి ఉందని, బాలికను బలిస్తే బంగారం లభిస్తుందని స్వామీ నమ్మబలికాడు. దీంతో ఓ బాలిక తండ్రికి పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపి పాపను పూజల కోసం తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. పూజలు చేస్తున్న సమయంలో బాలికను దుప్పటి కప్పి నిద్రపుచ్చారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి అప్రమత్తతతో పోలీసులు సకాలంలో చేరుకుని పూజలను అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే, పోలీసులు ఈ ఘటనను బయటకు పొక్కకుండా



ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాలికను బలిచ్చే ప్రయత్నం జరిగిందంటే చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది, కానీ పోలీసులు గోప్యంగా ఉంచడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

పూజలు నిర్వహించిన వారిని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా, పూజల సమయంలో పెద్ద పళ్లెంలో మాంసం ఉండటం కలకలం రేపుతోంది. అది మనిషి మాంసమా లేదా జంతువులదా అని తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బంగారం కోసం గతంలో ఇంకెవరినైనా బలి ఇచ్చి ఉండొచ్చనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరపాలని వారు కోరుతున్నారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు.

# కులగణన నిర్ణయం చారిత్రాత్మకం.

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ. ప్రధాని మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 1:**



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణన తో పాటు కులగణన నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో నిఖిల్ సాయి చౌరస్తా లో గురువారం ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రధానమంత్రి నరేంద్రమోది, రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, ఎంపీ అరవింద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు, భారతదేశ జనగననతో పాటు కులగనన చేయాలనీ ఒక చరిత్రత్మక నిర్ణయాన్ని కేంద్ర మంత్రి మండలి తీసుకోవడం దేశ ప్రజలందరు హర్షించదగ్గ విషయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణన, కులగణన ఆధారంగా దేశంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ది చేకూరుతుందని అన్నారు. దేశ భద్రత విషయంలో ఈ దేశ పౌరులు ఎంతమంది, ప్రక్క దేశాలైన పాకిస్తాన్, బాంగ్లాదేశ్ వివిధ దేశాల నుండి వచ్చిన అక్రమ చొరబాటుదార్లు, రోహింగ్యలు ఎవరనేది పూర్తి లెక్కలు తెలుతాయి అని అన్నారు. కేంద్ర మంత్రిమండలి తీసుకున్న నిర్ణయానికి దేశ ప్రజలు, మేధావులు అందరు హర్షం వ్యక్తం చేస్తుంటే కాంగ్రెస్ మాత్రం ఈ విజయం మాదే అంటు గొప్పలు చెప్పుకునే సిగ్గు మాలిన పని చేస్తుంది అన్నారు.

దేశాన్ని 60 ఏళ్ళు కాంగ్రెస్ పరిపాలించిన సమయంలో ఎందుకు దేశమంతట కులగనన నిర్వహించలేదని ప్రశ్నించారు దీనికి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. తెలంగాణలో నిర్వహించిన కులగనన ఒక తప్పుల తడక అని అన్నారు ఒక సామజిక వర్గాన్ని సంతృప్తి పరిచి బీసీలకు అన్యాయం చేసారన్నారు, తెలంగాణాలో నిర్వహించిన కులగనన చెత్త బుట్టలో వేయడానికే ఉపయోగ పడుతుందని, కాంగ్రెస్ నాయకులే దాన్ని తగలపెట్టిన విషయాన్నీ గుర్తు చేసారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే దినోత్సవం.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 1:**

మేడే కార్మికపోరాట దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి డిపోలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే ఎర్రజండాను ఎం.వెంకటిగౌడ్
ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు వి.డి దాస్ మాట్లాడుతూ, "చికాగో అమరవీరులకు జోహార్లు ఎర్రజండా వర్ధిల్లాలి, ప్రపంచ కార్మికులారా ఏకం కండి. పోరాడితే పోయేదేమిలేదు బానిస సంకెళ్లు తప్ప అని నినాదాలు చేశారు. మేడే స్ఫూర్తితో ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్య ల పరిష్కారం కోసం తప్పనిసరి ఐతే సమ్మె పోరాటమే మార్గమని, కార్మికులు భవిష్యత్తులో జరిగే పోరాటానికి సిద్ధంగా ఉండాలని" అన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, బాలాగౌడ్, లింగం, వెంకటేశం, శ్రీనివాస్,పూల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మూసి మురుగుకు చెక్.. ఊహించని రేంజ్‌లో ప్రణాళిక..

హైదరాబాద్: మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ ప్రాజెక్టును చేపట్టింది. రూ. 3,100 కోట్లతో రెండు దశల్లో ట్రంక్ లైన్లు నిర్మించనున్నారు. 80 శాతం మురుగు మూసీలోకి చేరుతుండటంతో.. 39 అదనపు ఎస్టీపీలను నిర్మించనున్నారు. నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తరం, దక్షిణం వైపు ట్రంక్ లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం మూసీ నదిలోకి నేరుగా మురుగు నీరు వదలడం వల్ల శుద్ధి కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. ట్రంక్ లైన్లు నిర్మించడం ద్వారా మురుగు నీటిని సేకరించి.. శుద్ధి కేంద్రాలకు తరలించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు.



హైదరాబాద్ నగరవాసులకు ఇబ్బందికరంగా మారిన మూసీ నది మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుం బిగించింది. మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేయాలనే లక్ష్యంతో మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) విస్తృత ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. మూసీ నదికి ఇరువైపులా భారీ మురుగు ట్రంక్ లైన్లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రెండు దశల్లో రూ. 3,100 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

త్వరలో జలమండలి ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి.. మురుగు కలుస్తున్న ప్రాంతాలను గుర్తించి.. లోటుపాట్లను విశ్లేషించిన తర్వాత కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న మురుగు నీటిలో 80 శాతం మూసీ నదిలోకి చేరుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) మధ్యలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నది పూర్తిగా మురుగుతో నిండిపోయింది.

గతంలో జంట జలాశయాల నుంచి నార్సింగి వరకు కొంతవరకు స్వచ్ఛమైన నీరు కనిపించేది. అయితే.. ఎగువ ప్రాంతాల్లో జనావాసాలు పెరగడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు నదికి ఇరువైపులా 45 కిలోమీటర్ల మేర 2,000 మిమీ నుంచి 2,600 మిమీ డయా పైపులైన్లతో మురుగును మళ్లించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ. 3,100 కోట్ల వ్యయంతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. ఆ ప్రణాళికను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోంది.

ప్రస్తుతం నగరంలో 52 మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) ఉండగా.. సివరేజీ మాస్టర్ ప్లాన్ ప్రకారం మరో 39 ఎస్టీపీలు నిర్మించాల్సి ఉంది. ఈ ఎస్టీపీలను నిర్మించి, ట్రంక్ లైన్లకు అనుసంధానం చేయడం ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణపై ఎంఆర్‌డీసీఎల్ దృష్టి సారించింది. పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నిధుల కోసం దరఖాస్తు చేశారు. త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా.. ఉత్తరం వైపు తారామతి బారాదరి, నానక్‌రామ్‌గూడ, ఇబ్రహీం చెరువు, కార్వాన్, నాంపల్లి, నారాయణగూడ, అంబర్‌పేట, రామంతాపూర్, పీర్జాదిగూడ, కొర్రెముల ప్రాంతాల మీదుగా 27.5 కిలోమీటర్ల మేర రూ. 1,054 కోట్లతో ట్రంక్ లైన్ నిర్మాణం చేపట్టనుండగా.. దక్షిణం వైపు బాపూఘాట్, అత్తాపూర్, చార్మినార్, మలక్‌పేట్, నాగోల్, గౌరెల్లి ప్రాంతాల్లో 15 కిలోమీటర్ల మేర రూ. 1,048.95 కోట్లతో నిర్మాణం చేపడతారు.

నదికి ఉత్తరం, దక్షిణం వైపున నగరంలో రూ. 996.96 కోట్లతో ట్రంక్ లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం మూసీ నదిలోకి నేరుగా మురుగు నీరు వదలడం వల్ల శుద్ధి కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. ట్రంక్ లైన్లు నిర్మించడం ద్వారా మురుగు నీటిని సేకరించి.. శుద్ధి కేంద్రాలకు తరలించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు.

## అంగన్‌వాడీ టీచర్లకు ట్యాబ్‌లు...

తెలంగాణ: తెలంగాణలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సొంత భవనాలు లేని 23,982 కేంద్రాలకు కొత్తవి నిర్మించనున్నారు. ఆరేళ్లలోపు పిల్లలకు నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఇక అంగన్‌వాడీ టీచర్లకు 5జీ ట్యాబ్‌లు ఇవ్వనున్నారు. ఈ మేరకు 2025-26 కార్యాచరణ ప్రణాళికను శిశు సంక్షేమ శాఖ ప్రకటించింది.

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల సమూల మార్పునకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా, సొంత భవనాలు లేని 23,982 కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించడంతో పాటు, ఆరేళ్లలోపు చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించనుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో, అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా నివసిస్తున్న పిల్లల కోసం ప్రత్యేకంగా 23 మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.

ప్రాథమిక విద్యలో చేరిన ప్రతి చిన్నారికి ఉచితంగా యూనిఫాం, బూట్లు అందించాలని నిర్ణయించింది. అలాగే, అంగన్‌వాడీ టీచర్ల పనితీరును మెరుగుపరచడానికి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి వారికి 35,781 అత్యాధునిక ట్యాబ్‌లను అందించనుంది. ఒక్కో ట్యాబ్ కోసం రూ.20 వేలు ఖర్చు చేయనున్నారు. ఇటీవల మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను శిశు సంక్షేమ శాఖ ప్రకటించింది. తెలంగాణలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 23,982 కేంద్రాలకు సొంత భవనాలు లేవు. వీటిలో 12,363 కేంద్రాలు ప్రైవేటు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా.. మిగిలినవి ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి, ఉపాధి హామీ పథకం కింద 5,013 కేంద్రాలకు భవనాలు మంజూరు చేయగా, ఇప్పటివరకు కేవలం 225 భవనాల నిర్మాణం మాత్రమే పూర్తయింది. ఈ నేపథ్యంలో, మంత్రి సీతక్క ప్రతి మండలంలో కనీసం మూడు గ్రామాల్లో భవనాల నిర్మాణం వెంటనే ప్రారంభించాలని ఈ ఏడాది చివరి నాటికి వాటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రంలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్డి, విద్యుత్ సౌకర్యం కల్పించడానికి రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించనున్నారు. అంతేకాకుండా, ఆదివాసీ ప్రాంతాల్లో అంగన్‌వాడీ సేవలను విస్తరించే లక్ష్యంతో ఒక్కోటి రూ.12 లక్షల వ్యయంతో 85 నూతన కేంద్రాల నిర్మాణం పూర్తి చేయాలని శిశు సంక్షేమ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్లు ఉపయోగిస్తున్న సాధారణ మొబైల్ ఫోన్లు, పిల్లల రోజువారీ హాజరు, సరుకుల రవాణా, వారి ఆరోగ్యం, బరువు, ఎత్తు వంటి సమాచారాన్ని నమోదు చేయడానికి అనువుగా లేవు. ఈ సమస్యను అధిగమించడానికి, 35,781 మంది అంగన్‌వాడీ టీచర్లకు 5%+% ట్యాబ్‌లను అందించాలని నిర్ణయించారు. ఈ చర్యల ద్వారా రాష్ట్రంలోని అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## 3.5 కిలోల బంగారం.. దుబాయ్ నుంచే..




హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో దుబాయ్ నుండి వచ్చిన ప్రయాణికుడి వద్ద 3.5 కిలోల అక్రమ బంగారం పట్టుబడింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బంగారాన్ని చట్టబద్ధంగా పొందడమే సురక్షితమని అధికారులు సూచిస్తున్నారు. ఇలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. గత కొద్ది నెలలుగా శంషాబాద్ విమానాశ్రయంలో ఇలాంటి అనేక కేసులు వెలుగులోకి వచ్చాయి. వివిధ రూపాల్లో.. చాకచక్యంగా బంగారాన్ని తరలించే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. నిఘా పెంచిన అధికారులు ఎప్పటికప్పుడు వారి ప్రయత్నాలను భగ్నం చేస్తున్నారు.

బంగారం ధరలు రోజురోజుకూ భగ్గుమంటున్నాయి. సామాన్యులకు అది కొనే ఆలోచన కూడా కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితులను కొందరు అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ విమానాశ్రయాలు అక్రమ బంగారు రవాణాకు అడ్డాలుగా మారుతున్నాయి. శంషాబాద్ విమానాశ్రయంలో తాజాగా జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. దుబాయ్ నుండి వచ్చిన ఒక ప్రయాణికుడి వద్ద దాదాపు 3.5 కిలోల బంగారాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ బంగారం రూ.3.45 కోట్లు విలువ చేస్తుందని అధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడు బంగారం రవాణాకు సంబంధించి ఎలాంటి సరైన ధ్రువపత్రాలు చూపించలేకపోయాడు.

బంగారం ధరలు ప్రస్తుతం లక్ష రూపాయల సమీపంలో ఉండటంతో.. తక్కువ ధరకు లభించే దుబాయ్ వంటి ప్రాంతాల నుండి బంగారాన్ని అక్రమంగా తరలించి ఇక్కడ అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని స్మగ్లర్లు ప్రయత్నిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అతనితో పాటు ఈ అక్రమ రవాణాలో ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఒక్క సంఘటనే కాదు.. గత కొద్ది నెలలుగా శంషాబాద్ విమానాశ్రయంలో ఇలాంటి అనేక కేసులు వెలుగులోకి వచ్చాయి. వివిధ రూపాల్లో.. చాకచక్యంగా బంగారాన్ని తరలించే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు దుస్తుల్లో దాచి తీసుకొస్తే.. మరికొందరు ఎలక్ట్రానిక్ వస్తువుల్లోనూ, ఆహార పదార్థాల్లోనూ బంగారాన్ని దాచి రవాణా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ.. నిఘా పెంచిన అధికారులు ఎప్పటికప్పుడు వారి ప్రయత్నాలను భగ్నం చేస్తున్నారు.

బంగారం కేవలం ఒక లోహం కాదు.. అది ఒక విలువైన సంపద. తరతరాలుగా దానికున్న ప్రాముఖ్యత, దానికున్న ఆర్థిక స్థిరత్వం ఎంతో మందిని ఆకర్షిస్తుంది. సంప్రదాయాలు, పెట్టుబడులు ఇలా ఎన్నో రూపాల్లో బంగారం మన జీవితాల్లో ఒక భాగమైపోయింది. అయితే.. దాని విలువ పెరిగే కొద్దీ, దానిని సొంతం చేసుకోవాలనే ఆశ కొందరిని తప్పుడు దారులకు నడిపిస్తోంది. శంషాబాద్‌లో పట్టుబడిన వ్యక్తి కూడా అలాంటి ఆశతోనే అక్రమ మార్గాన్ని ఎంచుకున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ అతన్ని చట్టానికి చిక్కేలా చేసింది.

అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ.. అక్రమ రవాణాదారుల ఆట కట్టించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ.. స్మగ్లర్లు కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో.. ప్రయాణికులు కూడా మరింత బాధ్యతగా ఉండాలి. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలి. స్వార్థపూరితమైన కొందరి అత్యాశ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లడమే కాకుండా.. చట్టపరమైన ఇబ్బందులు కూడా తలెత్తుతాయి. కాబట్టి, బంగారాన్ని చట్టబద్ధమైన మార్గాల్లో పొందడమే సురక్షితమైన మార్గం. అక్రమ మార్గాల వెంట వెళ్తే.. చివరికి కష్టాలు తప్పవు.

## పదో తరగతిలో స్కూల్ టాపర్.. ఫలితాలు రాకముందే విషాదం

రాజన్న సిరిసిల్ల: జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల నాగచైతన్య.. అదే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. భవిష్యత్ మీద ఎన్నో ఆశలతో బుద్ధిగా చదువుకుంది. శ్రద్ధగా పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తుండగా.. అనుకోని ఘటన జరిగింది. తీవ్ర అనారోగ్యానికి గురై చనిపోయింది. ఏ లక్ష్యం పెట్టుకొని చదివిందో తెలియదు కానీ, తోటి విద్యార్థుల అందరి కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకొని స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఎన్ని మార్కులు వస్తే ఏం లాభం.. ఆనంద పడడానికి, లక్ష్యాన్ని సాధించడానికి ఆ విద్యార్థిని ఇప్పుడు లేదు. ఏప్రిల్ 30న విడుదలైన పదో తరగతి ఫలితాల్లో .. ఆకుల నాగ చైతన్యకు 510 మార్కులు వచ్చాయి. మల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అందరి కంటే ఎక్కువ మార్కులు ఆ అమ్మాయికే వచ్చాయి. నాగ చైతన్య టెన్త్‌లో స్కూల్ టాపర్‌గా నిలిచిన విషయాన్ని ఉపాధ్యాయులు ఆమె తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో తమ బిడ్డ చదివిన పాఠశాలకు వచ్చిన ఆ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కష్టపడి చదివి స్కూల్‌లో అందరికంటే ఫస్ట్ వచ్చిన తమ బిడ్డ.. రిజల్ట్ రాక



ముందే చనిపోవడంతో వారు రోదించిన తీరు అక్కడున్న వారందర్నీ కంటతడి పెట్టించింది. మరోవైపు టీచర్లు సైతం నాగ చైతన్య మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. నిజామాబాద్‌కు చెందిన సిర్ప క్రితి 600కి గానూ 596 మార్కులు సాధించారు. జిల్లాల వారీగా చూస్తే.. పదో తరగతి ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లా తొలి స్థానంలో నిలవగా.. వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచినట్లు అధికారులు తెలిపారు. లాస్ట్ ఇయర్‌తో పోలిస్తే ఉత్తీర్ణత శాతం 1.47% పెరిగింది. తెలంగాణలో జూన్ 3 నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు.

# హక్కుల పరిరక్షణకు పోరాడుదాం.

**మేడే స్ఫూర్తితో కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి.**

**ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) నేతల పిలుపు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 1**




: హక్కుల పరిరక్షణకు పోరాటాలను ఉధృతం చేస్తామని, మేడే స్ఫూర్తితో కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలనీ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) నేతలు పిలుపునిచ్చారు. 139వ మేడే సందర్భంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్, మున్సిపల్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి మేడే జెండా ఆవిష్కరణ, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్ లు మాట్లాడుతూ, పనిగంటల తగ్గింపు, మెరుగైన జీవనం కోసం 1886లో అమెరికాలోని చికాగో కార్మికుల పోరాటం, 8మంది అమరుల త్యాగాలతో ప్రపంచ కార్మిక దినం మేడే అవతరించిందన్నారు. ప్రపంచ అభివృద్ధిలో అడుగడుగునా శ్రామికుల త్యాగమే ఉందన్నారు. దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం ఏడు కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ, సాంఘిక భద్రత, తగిన వేతనాలు అందుతున్నాయన్నారు. మిగతా 40 కోట్ల శ్రమజీవులకు సరిపడా వేతనాలు, జీవనభద్రత లేదన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను కేంద్ర ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేస్తూ, మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా ఆమోదించి, అమలు చేయాలని చూడడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారని ఆరోపించారు. మేడే స్ఫూర్తితో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం కోసం, ఉద్యోగ, సామాజిక భద్రత కోసం పోరాడాలన్నారు. 139 వ మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా, పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టీయుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న జిల్లా నాయకులు కిరణ్, రవి, విటల్, లింగం, నాయకులు రాజేశ్వర్ గోవర్ధన్, రాము, సుజాత, యాదమ్మ, శైలజ, శంకర్, శాంతికుమార్, విజయ్, శివకుమార్, హన్మండ్లు, నవీన్, రాజు, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం.

**బిఎల్ టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యస్. సిద్దిరాములు.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 1**

: పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ (బిఎల్ టియు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యస్. సిద్దిరాములు అన్నారు. అంతర్జాతీయ శ్రామిక వర్గ మేడే దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో సుత్తి కొడవలి, అశోక చక్రంతో కూడిన పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక 4 కోడ్ లు తెచ్చి భారత బహుజన కార్మిక వర్గాన్ని కార్పోరేట్ కంపెనీలకు కట్టుబానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా బహుజన శ్రామిక వర్గం పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల వల్ల పరిశ్రమ సంక్షోభంతో దేశవ్యాప్తంగా పరిశ్రమపై ఆధారపడిన 10 కోట్ల మంది బీడీ కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ పరిశ్రమ పై జియస్టీని మరియు కొప్టా చట్టం ను తొలగించి, బీడీ పరిశ్రమ లో పనిచేయు కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ" 5000 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు సబ్బాని లత, బిఎల్ టీయూ నాయకులు బి. జగదీష్, సైయ్యద్, మంత్రి సుదర్శన్, కార్మికులు పాల్గొనారు.

# దోపిడి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం.

**- ఐఎఫ్టీయు ఆధ్వర్యంలో మేడే సంబరాలు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 1:**



శ్రమ దోపిడి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఐఎఫ్ టీయు నాయకులు పిలుపునిచ్చారు. ఐఎఫ్టీయు ఆధ్వర్యంలో గురువారం నగరంలో మేడే సంబరాలు ఘనంగా నిర్వహించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య నగర కార్యదర్శి ఎం. శివ కుమార్ ఇప్ప మేడే జెండాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు యం.శివకుమార్, మచ్చ మోహన్, రైస్, రాజు లు మాట్లాడుతూ, చికాగో కార్మికులు చిందించిన రక్తముతో సృష్టించినదే ఎర్రజెండా అని గుర్తు చేశారు. ఎర్రజెండా వెలుగులో ప్రపంచంలో, దేశంలో అనేక ప్రజా, కార్మిక పోరాటాలు జరిగాయని, పీడిత ప్రజలు పోరాడి అనేక హక్కులు సాధించుకున్నారని తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి నుండి ఎర్రజెండా నాయకత్వంలో పోరాడి సాధించుకున్న అనేక ప్రజా, కార్మిక చట్టాలను నేడు అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నదని, బహుళ జాతి సంస్థలకు, కార్పొరేట్లు అదాని, అంబానీలకు దేశ సంపదను కట్టబెట్టడమే కాక, అనేక రాయితీలు ఇచ్చి కార్పోరేట్ లను అందలంలోకి ఎక్కించిందని, అది భారత దేశ కార్మికుల, ప్రజల శ్రమ దోపిడి వలనే లక్షల కోట్లు సంపాదించారని విమర్శించారు. ఒకవైపు శ్రమ దోపిడి చేస్తూనే మరో వైపు ప్రజలపై తీవ్రమైన పన్నుల భారాన్ని మోపిందని ఏద్దేవా చేశారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని మోడీ ప్రభుత్వం 12 గంటలకు పెంచిందని, ఇది బడా కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడేదే తప్ప కార్మిక వర్గానికి, పేద ప్రజలకు ఉపయోగపడేది కాదని అన్నారు. దేశభక్తి ముసుగులో మెజారిటీ ప్రజలను రెచ్చగొట్టి మైనారిటీ ప్రజలపై దాడులకు పుసిగొల్పుతున్నదని దుయ్యబట్టారు. చికాగో కార్మికుల అందించిన పోరాట స్ఫూర్తితో దేశంలో, రాష్ట్రంలో మోడీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం - ఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా, రమేష్, సత్యం, జన్నారపు రాజేశ్వర్, ఇప్ట నాయకులు గంగాధర్, రమేష్, వకీలు, తదితదిరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరిస్తున్నాయి.

**సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లాల కార్యదర్శి వి.ప్రభాకర్.**

**ఆర్మూర్ లో టీయుసిఐ ఆధ్వర్యంలో మేడే బహిరంగ సభ.**



**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, మే 1**

: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరిస్తున్నాయనీ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లాల కార్యదర్శి వి,ప్రభాకర్ అన్నారు. ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏం ముత్తన్న మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరించి సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్మాట్లాడుతూ, చికాగోలో చిందిన రక్తం ఆ అమరవీరుల త్యాగం, వారి త్యాగాలను స్మరిస్తూ కార్మిక హక్కులను సాధించాలనీ అన్నారు. పోరాడి తెచ్చుకున్న కార్మిక హక్కులను, చట్టాలను, నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఎనిమిది గంటల పని దినాన్ని రూపుమాపి కార్మికుల శ్రమను దోపిడీకి పాలకులే సహకరిస్తున్నారని అన్నారు. హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి. దేవారం, సబ్ డివిజన్ కార్యదర్శి బి. కిషన్, కార్మిక సంఘం జిల్లా నాయకులు రాజేశ్వర్, సత్తెక్క, కార్మికులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడుదాం.

**- సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 1:**



మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడుదాం అని సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. మేడే సందర్భంగా కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడారు. మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను రద్దుచేసి కొత్త 4 లేబర్ కోడ్ లను తీసుకురావడం కార్మిక ద్రోహం అని అన్నారు. వీటికి నిరసనగా మే 20న దేశవ్యాప్త సర్వత్రిక సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం ఏడు కోట్ల మంది కార్మికులకు మాత్రమే ఉద్యోగ భద్రత తగిన వేతనాలతో జీవిస్తున్నారని మిగతావారు బతుకు భద్రత లేక కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కోర్టుల గురించి గొప్పలు వల్లించే కేంద్ర ప్రభుత్వం, సమాన పనికి సమాన వేతనం అనే సుప్రీంకోర్టు తీర్పును ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చివరికి కార్మికులు జీవించడానికి సరిపడే వేతనాలు ఇవ్వాలని పోరాడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసంగటిత కార్మిక వర్గానికి ఏ విధమైన సామాజిక భద్రత లేదని అన్నారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ స్కీం వర్కర్లు కార్మికులరైజేషన్ చేసి ప్రభుత్వమే కార్మికుల రిక్రూట్మెంట్ చేసుకోవాలని ఏజెన్సీ వ్యవస్థలను రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, సిఐటియు నాయకులు రాజనర్సు, ప్రభాకర్, మహబూబ్, సంతోష్, ప్రవీణ్, ప్రభు, దీవెన, శివ రాజవ్వ, సువర్ణ, సాయవ్వ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ లక్ష్యంతో ఉన్నత విద్యలో రాణించాలి.



**నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్. భూపతిరెడ్డి.**

**ఎస్ఎస్ సిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన "సత్యశోధక్" విద్యార్థులకు అభినందన.**

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, మే 1:**

విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో విద్యను అభ్యసించి పదవ తరగతిలో ఉన్నత మార్కులు సాధించడం అభినందనీయమని, ఉత్తమ లక్ష్యం, పట్టుదలతో ఉన్నత విద్యలో రాణించాలని నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు ఆర్ భూపతి రెడ్డి అన్నారు. ఎస్.ఎస్.సి 2025 ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సిరికొండ మండల్ టాపర్లుగా నిలిచిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులను తమ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే అభినందించారు. పాఠశాలకు చెందిన కె. శివ 581(ప్రథమ), వి. సహర్ష 573 (ద్వితీయ),ఆర్. రచన 572 (తృతీయ )లకు ప్రత్యేక జ్ఞాపికలను అందించి సత్కరించారు. ఈ సంధర్భంగా ఎం.ఎల్.ఏ. ఆర్. భూపతిరెడ్డి మాట్లాడుతూ, నిరంతర శ్రమ, క్రమశిక్షణ ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసం చేస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని, పాఠశాల స్థాయిలో నేర్చుకున్న విషయపరిజ్ఞానంతో ఇష్టమైన రంగాన్ని ఎంచుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులపై చెడు వ్యాసనాల ప్రభావం ఎక్కువగా ఉందని సాధ్యమైనంత మేరకు వాటికీ దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో నిమగ్నం కాకుండా సమకాలీన అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకొని పోటీ ప్రపంచానికి ధీటుగా ఉన్నప్పుడే విజేతల సరసన నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, డి.సి.సి. కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, సతీష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

**జిల్లా విద్యాధికారి ప్రశంసలు**

పదవ తరగతిలో సిరికొండ మండల్ టాపర్లుగా నిలిచిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులను జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్ ప్రశంసించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని ప్రణాళిక బద్దంగా సాధన అద్భుత ఫలితాలు సాధించవచ్చని, దృఢ సంకల్పంతో ఎదురైనా ఆటంకాలను అధిగమిస్తూ ముందుకు వెళ్ళినప్పుడే సమాజానికి విజేతలుగా పరిచయం అవుతారన్నారు. జీవితంలో విద్యార్థి దశ కీలకమని అందులోనూ ఉన్నత చదువులు కీలక పాత్రను పోషిస్తాయన్నారు. చదువు సంస్కారం వినయంలను మమేకం చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదిగి రేపటి తరాలకు ఆదర్శ ప్రాయమైన వ్యక్తులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, సతీష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# హక్కుల రక్షణకు ఐక్యంగా పోరాడాలి.

**- ఎఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తోట వెంకటలక్ష్మి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 1**



: కార్మికులు హక్కుల రక్షణకు ఐక్యంగా పోరాడాలనీ ఎఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తోట వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. 139వ మేడే దినోత్సవం సందర్భంగా శ్రామిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్ (ఎఐఎఫ్ టీయు) కార్యాలయం వద్ద మేడే జెండాను వెంకట లక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోట వెంకటలక్ష్మి మాట్లాడుతూ, పనిగంటల తగ్గింపు, మెరుగైన జీవనం కోసం 1886లో అమెరికాలోని చికాగో కార్మికుల పోరాటం, 8మంది అమరుల త్యాగాలతో ప్రపంచ కార్మిక దినం మేడే అవతరించిందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను కేంద్ర ప్రభుత్వం తొలగించి, మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా ఆమోదించి, అమలు చేయాలని చూస్తుందని అన్నారు. దీనివల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారని, ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై

ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ, కోప్టా చట్టం వల్ల బీడీ పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోతుందని, పరిశ్రపమపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. బీడీ పరిశ్రమ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు

సామల అనసూయతో పాటు, కళావతి, భాగ్యలక్ష్మి, నరసయ్య, లతా, లక్ష్మి, సక్కవ్వ, తదితరులు పాల్గొన్నారు.